17న ఉప్పుగూడలో శ్రీరామ శోభాయాత్ర



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న తాడెం శ్రీనివాసారావు తదితరులు

చాంద్రాయణగుట్ట: శ్రీరామ నవమి సందర్భంగా ఈనెల 17న శ్రీరామ సేన ఆధ్వర్యంలో ఉప్పుగూడ పరిసరాలలో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తాడెం శ్రీనివాసారావు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం సాయంత్రం 4 గంటలకు తానాజీనగర్‌లోని గణేష్ మండపం నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్ర ఛత్రిమేట్, గోశాల, అరుంధతి కాలనీ, రామ మందిర్, శంకర్ బాగ్, రక్షాపురం, భూలక్ష్మీ ఆలయం, న్యూ రక్షాపురం, సాయిబాబానగర్, శివాజీనగర్, అశోక్ నగర్, శివసాయినగర్, ఉప్పుగూడ మహంకాళి ఆలయం మీదుగా కొనసాగుతుందన్నారు. ఈ శోభాయాత్రలో బీజేపీ ఎంపీ అభ్యర్థులు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాధవీలత ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెండెం లక్ష్మణ్, మాణిక్ ప్రభు, రాజేందర్, గంజి వేణు, శివ, రవి, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

నేడు శ్రీనివాసుని కల్యాణం



మోహినీ అలంకరణలో పూజలు అందుకుంటున్న స్వామివారు

లంగర్‌హౌస్: వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు సంగం ఆలయంలో లక్ష్మీ, శ్రీనివాస, పద్మావతిల వివాహం నిర్వహించనున్నారు. వీర వెంకట విజయ రాఘవస్వామి ఆలయంలో శ్రీరామ నవమి పురస్కరించుకొని వసంత నవ రాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో వేద పండితులు రాజనర్సిహ చారి సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం వేద పారాయణం, యాగశాలలో పూర్ణాహుతి జరిపారు. ఇందులో భాగంగా స్వామి వారు క్షీర సముద్ర సమయంలో అసురులను మభ్యపెట్టి వారి మోసాన్ని తరిమేందుకు అవతరించిన మోహిని అవతారంలో దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంగం ఆలయంలో నేడు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం రాత్రి 7 గంటలకు నిర్వహించనున్నారు. సుదర్శణ హోమం తర్వాత కల్యాణ శ్రీనివాసుడిని గరుడ వాహనంపై లంగర్‌హౌస్ వీధుల్లో ఊరేగించనున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ రాజీవ్‌గాంధీనగర్‌లోని శ్రీ సాయి దుర్గా మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారం కొనసాగాయి. శ్రీ శంకరమంచి భార్గవ శర్మ ఆధ్వర్యంలో ఉదయం యాగ మండప హోమాలు, నంది, రాధాకృష్ణ, పోతరాజు విగ్రహ ప్రతిష్ఠ, నేత్రోన్మిలనం, మహా పూర్ణాహుతి, యాగమండప దేవత ఉద్వాసన, ప్రాణ ప్రతిష్ఠ, విగ్రహ అభిషేకం, మహాకుంభం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. బీఆర్ ఎస్ పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా కమిటీ అధ్యక్షుడు ఇ.గణేష్ యాదవ్, ఉపాధ్యక్షులు వై.తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శులు సి.గంగాధరం, బీహెచ్.వెంకటరమణ మూర్తి చర్యలు తీసుకున్నారు.

బీజేపీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయం



బీజేపీ బైక్ ర్యాలీలో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ హైదరాబాద్ పార్లమెంటు పబ్లిసిటీ ఇన్‌చార్జి దేవర శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో బీజేపీ బైక్ ర్యాలీ జరిగింది. దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈసారి బీజేపీ 400లకు పైగా ఎంపీ స్థానాలు గెలుచుకొని అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. నేడు ప్రజలు పార్టీని చూడడం లేదని కేవలం ప్రధాని నరేంద్రమోదీ పనితీరును గుర్తించి మరీ ఓటు వేస్తున్నారన్నారు. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు వేల కోట్ల రూపాయలు ఇచ్చిందని దీనికి తోడు సంక్షేమ పథకాలకు సాయం చేసిందన్నారు. అయితే అప్పటి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమ పథకాలుగా చెప్పుకుంటూ పబ్బంగడుపుకుందని తెలిపారు. ర్యాలీలో ప్రభు పూజారీ తదితరులున్నారు.

కందికల్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా ధన్‌రాజ్



ధన్‌రాజ్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట: కందికల్ గంగపుత్రం సంఘం అధ్యక్షుడిగా అంబటి ధన్‌రాజ్ ఎన్నికయ్యారు. బోయిగూడలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం కొనసాగింది. కమిటీ అధ్యక్షుడిగా ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా సి.నగేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా వినోద్, కె.నారాయణ, అసిస్టెంట్ కార్యదర్శిగా ఎ.ఆనంద్, కోశాధికారిగా ఎం.కృష్ణ, అసిస్టెంట్ కోశాధికారిగా గాలి అరుణ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు నూతన కమిటీని సన్మానించారు.

వచ్చే నెల 29, 30వ తేదీల్లో బాల సాహిత్య సమ్మేళనం

సుల్తాన్‌బజార్: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో వచ్చే నెల 29, 30వ తేదీల్లో హైదరాబాద్‌లో బాల సాహిత్య సమ్మేళనం జరుగుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పాఠశాల విద్యార్థులు, తెలుగు ఉపాధ్యాయులు, బాల సాహితీవేత్తలు, బాలల కోసం రచనలు చేస్తున్న వారు పాల్గొంటారని పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో తెలుగు భాషా వికాసం, బడి పిల్లల్లో రచనాభిరుచి పెంపొందించడం, పత్రికల్లో బాలల రచనలకు ప్రచురణావకాశాలు, కథలు చెప్పడంలో మెలకువలు, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, శిల్పం వంటి లలిత కళలపై, ప్రాథమిక అవగాహన మొదలైన సదస్సులు, గోష్ఠులు జరుగుతాయని తెలిపారు. ప్రతినిధులుగా పాల్గొనదలచిన వారు ఈనెల 30వ తేదీ లోగా 96037 27234కు వాట్సాప్‌లో వివరాలు పంపి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శాంతా వసంతా ట్రస్టు వ్యవస్థాపకుడు పద్మభూషణ్ డాక్టర్ కేఐ.వరప్రసాదరెడ్డి వారి మాతృమూర్తి శాంతమ్మ గారి సంస్మరణార్థం కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాలను నిర్వహణకు ఆర్థిక సౌజన్యం అందిస్తున్నారని శివారెడ్డి, చెన్నయ్య వివరించారు.

బ్లేడ్‌తో దాడి చేసిన ముగ్గురి రిమాండ్

గౌలిపురా: బార్‌లో పార్కింగ్ విషయంలో జరిగిన గొడవలో బ్లేడ్‌తో దాడి చేసిన ముగ్గురిని మొఘల్‌పురా పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగులచింతకు చెందిన పవన్ రూపనర్ (27) ఈనెల 9న రాత్రి 10 గంటలకు లాల్‌దర్వాజాలోని ఓ బార్‌లో మద్యం తాగడానికి స్నేహితులతో కలిసి వెళ్లారు. అదే సమయంలో బార్కాస్‌కు చెందిన రౌడీషీటర్ షేక్ సాజిద్ అలియాస్ సాజిద్ (28), భవానీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ అమీర్ అలియాస్ అమ్ము (37), యాకుత్‌పురాకు చెందిన నదీబాబా (31) మద్యం తాగేందుకు వచ్చారు. పవన్‌తో పాటు షేక్ సాజిద్, షేక్ అమీర్, నదీబాబా తమ వాహనాలను తీసుకునేందుకు పార్కింగ్ ప్రాంతానికి వచ్చారు. పార్కింగ్ విషయంలో గొడవ జరిగి సాజిద్, షేక్ అమీర్, నదీబాబా పవన్‌పై బ్లేడ్‌తో దాడి చేశారు. బార్ ఉద్యోగి సాయి ప్రసాద్ అడ్డుకునేందుకు ప్రయత్నించగా..ప్రసాద్‌పై సైతం దాడి చేశారు. గాయపడిన పవన్, సాయి ప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని శుక్రవారం షేక్ సాజిద్, షేక్ అమీర్, నదీబాబాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. షేక్ సాజిద్‌పై రాచకొండ కమిషనరేట్ పరిధిలో 9 కేసులు..షేక్ అమీర్‌పై మూడు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

దేశంలో ప్రధాని మోదీ హవా

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



గుడిమల్కాపూర్ పద్మానాభనగర్ కాలనీలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రచారం

గోల్కొండ: దేశంలో ప్రధాని నరేంద్రమోదీ హవా కొనసాగుతుందనికేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నాంపల్లి నియోజకవర్గంలోని గుడిమల్కాపూర్ పద్మానాభనగర్ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో మన దేశం ప్రపంచ అగ్రదేశాల సరసన చేరిందన్నారు. ప్రధాని తీసుకుంటున్న ఎన్నో నిర్ణయాలు భారత దేశాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాయన్నారు. భారతదేశం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల దేశం ప్రపంచ అగ్రరాజ్యాల ఆర్థిక రంగానికి ధీటుగా నిలుస్తున్నాయన్నారు. దౌత్య పరంగా కూడా మన దేశం ఎన్నో విజయాలు సాధించిందన్నారు. దేశంలో బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని ఆయన అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అవినీతి లేదని ఆయన అన్నారు. తెలంగాణలో పదేళ్లు అధికారం చెలాయించిన బీఆర్ఎస్ అవినీతికి కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారిందని అందుకే ప్రజలు దానిని తిరస్కరించారన్నారు. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని అధికారులు తన గుప్పిట్లో పెట్టుకున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. కేవలం అభివృద్ధి ఎజెండాతోనే తమ పార్టీ ముందుకు సాగుతుందని ఉత్తుత్తి హామీలు ఇవ్వకుండా పటిష్ఠమైన ప్రణాళికలు అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా నూతన పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ నిర్మూలనకు తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి తనను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. రోడ్డు పొడవునా ఆయన తనకు స్వాగతం పలుకుతున్న ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆయన వెంట హైదరాబాద్ బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు తదితరులున్నారు.

కిషన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలి

నాంపల్లి: సికింద్రాబాద్ ఎంపీగా కిషన్‌రెడ్డిని మరొకసారి గెలిపించుకోవాలని, ఆ దిశగా పార్టీ కార్యకర్తలు సన్నద్ధం కావాలని బీజేపీ నాంపల్లి ఎన్నికల ఇన్‌చార్జి యాదిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పాత మల్లేపల్లి పాఠశాలలో బూత్‌స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు ఆదేశాల మేరకు మల్లేపల్లి డివిజన్ అధ్యక్షుడు జగన్నాథరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రసంగించారు. మోదీ పాలనను ప్రజలకు వివరించాలని కోరారు. బూత్ స్థాయి కమిటీలను మరింత పటిష్టం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ కార్పొరేటర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణలో కాంగ్రెస్ అన్ని స్థానాలు గెలుస్తుంది'



కురకుల కృష్ణ

గోల్కొండ: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలు గెలుచుకొని క్లీన్ స్వీప్ చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారని కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీకే చెల్లుతుందని అయితే కాంగ్రెస్ ప్రజాభిమానాన్ని చూసి బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

గోల్కొండ: శానిటేషన్‌పై ఆ శాఖ అధికారులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రకాల పండ్లు అమ్మే ప్రదేశాలు, రంజాన్ స్పెషల్ మార్కెట్‌లు వెలిసిన ప్రాంతాల్లో శానిటేషన్ బృందాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హకీంపేట్ చౌరస్తా, ఎండిలైన్స్‌తో పాటు గోల్కొండ మోతీ దర్వాజా, కటోరాహౌజ్ తదితర ప్రాంతాల్లో అదనపు సిబ్బందితో పాటు అదనపు చెత్త తరలింపు వాహనాలు ఏర్పాటు చేసి చెత్తను తరలించారు.

ఐపీసీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా శివపావని

సుల్తాన్‌బజార్: ఇండియన్ ప్రజా కాంగ్రెస్ (ఐపీసీ) పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిగా ప్రముఖ సంఘ సేవకురాలు శివ పావనిని పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ ప్రకటించారు. శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జాతీయ నాయకులు నర్సింహా గుప్తా, రామ సుబ్బారెడ్డి, జగదీష్, నవీన్, సరిత పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు



గోల్కొండ: గంగా జమునా తహసీబుకు గోల్కొండ ప్రతీక అని గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయి బాబాచారి అన్నారు. ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ఖారీ సయ్యద్ మతీన్‌ఆలీ షాను శుక్రవారం ఆయన కలిసి ఈద్ ముబారక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండలో హిందూ ముస్లింల మధ్య కానవచ్చే ప్రేమానుబంధాలు, ఆత్మీయ బంధాలు ఇతర ప్రాంతాల వారికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీకాంత్‌చారి, శ్రీ మహంకాళీ అమ్మవారి ఆలయ పూజారి బి.సురేష్‌చారి తదితరులున్నారు.

నేడు మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ వార్షికోత్సవం



చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. శనివారం తెల్లవారు జామున 3 గంటల నుంచి సుప్రభాత సేవ, దేవతాభిశేకాలు, దీపారాధన, వార్షికోత్సవ సంకల్పం, విగ్నేశ్వర పూజ, రక్షాబంధనం తదితర కార్యక్రమాలతో పూజలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం బ్రహ్మాది మండల స్థాపన, లక్ష్మి స్థాపనం, రుద్ర పీఠ స్థాపనం, ఆంజనేయ, సుబ్రహ్మణ్య స్థాపనం, నవగ్రహ దేవత పూజ, నవగ్రహ హోమం, గణపతి హోమం, రుద్ర హోమం, మండల హోమం, చండీ హోమం, మహా పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మహా నైవేద్యం అనంతరం భక్తులందరికీ మధ్యాహ్నం 2 గంటలకు అన్న ప్రసాద వితరణ కొనసాగుతుందన్నారు. ఇందుకు ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

మంచి, చెడు స్పర్శపై అవగాహన



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్

చాంద్రాయణగుట్ట: మంచి, చెడు స్పర్శకు సంబంధించిన విద్య చిన్నారులలో ఆరోగ్యకరమైన సంబంధాలను పెంపొందించడానికి దోహదపడుతుందని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. సామాజిక వేత్తలు హిమజ, లోహిత, మల్లీశ్వరీ ఆధ్వర్యంలో చాంద్రాయణగుట్టలోని రెసిడెన్షియల్ బ్రిడ్జి కోర్సు బాలికల క్యాంప్ పాఠశాలలో విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో అమ్మాయిలకు ఎటు వైపు నుంచి ఎలాంటి ఆపద వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి సమయంలో విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్‌ల విషయం తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా వివిధ రకాల పరిచయాల మధ్య వ్యత్యాసాలను గుర్తించి తెలుసుకోవడం ద్వారా మనల్ని శక్తివంతం చేస్తుందన్నారు. అనంతరం పిల్లలకు పుస్తకాలు, మిఠాయిలు, శానిటరీ న్యాప్కిన్స్ పంపిణీ చేశారు.

ఎన్నికల్లో నాకే ఓటు వేయాలి



చార్మినార్: పార్లమెంట్ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్థానిక ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం బహదూర్‌పురా శాసన సభ నియోజకవర్గంలోని కామాటిపుర, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి కూడా తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పోలీస్ కమిషనర్‌కు స్వాగతం



కమిషనర్‌కు స్వాగతం పలికిన పాల్కి శోభాయాత్ర నిర్వాహకులు ఆనంద్ సింగ్, పప్పు మాత్రే

అబిడ్స్: ధూల్‌పేట్, పురానాపూల్, బేగంబజార్ ప్రాంతాల్లో పర్యటించిన నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి పాల్కి శోభాయాత్ర నిర్వాహకులు ఆనంద్‌సింగ్, పప్పుమాత్రే స్వాగతం పలికారు. 17న నిర్వహించే పాల్కి శోభాయాత్రపై కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆనంద్‌సింగ్ మాట్లాడుతూ..కొన్ని ఏళ్లుగా కొనసాగుతున్న పాల్కి శోభాయాత్రను ఈ సంవత్సరం పెద్ద ఎత్తున చేపడుతామన్నారు.

పార్టీ కోసం పని చేసే వారికే ప్రాధాన్యం



ఎమ్మెల్యే కౌసర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రేణుక

గోల్కొండ: మజ్లిస్ పార్టీ కోసం పని చేసే వారికే ప్రాధాన్యం ఇవ్వబడుతుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం లంగర్‌హౌస్‌కు చెందిన మజ్లిస్ సీనియర్ నాయకురాలు మత్య రేణుక ఎమ్మెల్యేను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీలో మహిళలకు ఎప్పుడూ సరైన ప్రాధాన్యం లభించిందని, పార్టీ అధినాయకుడు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మహిళలను ఎప్పుడు కూడా పార్టీలో గౌరవం ఇచ్చి వారికి పదవులు కూడా ఇచ్చారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో అసదుద్దీన్‌ను భారీ మెజార్టీతో గెలిపించడానికి అందరు కలిసికట్టుగా పని చేయాలన్నారు.

'ఇస్లాం మతం శాంతిని ప్రభోదిస్తుంది'



మాట్లాడుతున్న మతీన్ ఆలీషా

గోల్కొండ: ఇస్లాం మతం శాంతిని ప్రభోదిస్తుందని గోల్కొండ అక్తరీ మసీదు ప్రధాన ఇమామ్ మతీన్ ఆలీషాఖాద్రి అన్నారు. శుక్రవారం ప్రార్థనల్లో ఆయన గోల్కొండలోని అక్తరీ మసీదులో సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి ముస్లిం యువత కొన్ని విచ్ఛిన్నకర శక్తుల మాటలకు లొంగి హింసామార్గం బాటపట్టారన్నారు. అయితే ఇస్లాంలో ఎంత వెతికినా విచ్ఛిన్నకర శక్తులు, హింసాత్మక సంఘటనలకు తావ్వు లేదన్న విషయం స్పష్టం కనబడుతుందని అన్నారు. రంజాన్ మాసంలో పాటించిన దీక్షను నమాజ్ చదవడాన్ని మునుముందు కూడా కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

లష్కర్‌లో కాంగ్రెస్‌దే విజయం

అబిడ్స్: సికింద్రాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఓబీసీ సెల్ గ్రేటర్ కార్యదర్శి వాసు ముదిరాజ్ పేర్కొన్నారు. ముదిరాజ్ కులస్తులతో పాటు అన్నివర్గాల ప్రజలు దానం నాగేందర్ వైపే ఉన్నారన్నారు. నాగేందర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వాసు ముదిరాజ్ మాట్లాడుతూ..నాంపల్లి నియోజకవర్గంలో, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేగా కొనసాగిన దానం నాగేందర్‌ను స్థానిక ప్రజలంతా ఎంతో అభిమానంతో ఆదరిస్తారన్నారు. రెండు నియోజకవర్గాల అభివృద్ధి పెద్ద ఎత్తున చేశారన్నారు. సికింద్రాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలతోనే విజయం సాధిస్తారన్నారు.

స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ



గోల్కొండ: అనాథ విద్యార్థులకు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం వారు శుక్రవారం స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఎన్ఎండీసీ సీనియర్ మేనేజర్ రాకేష్ గొండు ఆధ్వర్యంలో చాంద్రాయణగుట్టలోని కారుణ్య భారతీ అనాథ శరణాలయంలోని విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని సంఘం అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ తెలిపారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వనాథ్, సలహాదారు శివరామకృష్ణ, సంయుక్త కార్యదర్శి అన్నపూర్ణ, కార్యనిర్వహక కార్యదర్శి దీపిక తదితరులున్నారు.

'హైదరాబాద్‌లో మజ్లిస్‌ను చిత్తుగా ఓడిస్తాం'



లడ్డులాల్ యాదవ్‌ను సత్కరించిన సంకేష్ సింగ్, సందీప్ సింగ్ తదితరులు

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీని చిత్తుగా ఓడించి దేశంలో రికార్డు సృష్టిస్తామని రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షుడు లడ్డులాల్ యాదవ్ పేర్కొన్నారు. బేగంబజార్‌లోని కార్యాలయంలో నూతనంగా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన లడ్డులాల్ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హైదరాబాద్‌తో రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వ పథకాలతో అన్నివర్గాల ప్రజలు బీజేపీ వైపే ఉన్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. రెండి పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో సంకేష్ సింగ్, సందీప్ సింగ్, సన్ని సింగ్, షల్లు సింగ్, అఖిలేష్, ఆకాష్ సింగ్, విశాల్ సింగ్ పాల్గొన్నారు.

రేపు అయ్యప్ప ఆలయంలో పూజలు

గౌలిపురా: ఈ నెల 14న విషు ఉత్సవం సందర్భంగా గౌలిపురాలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఉదయం 5 గంటలకు శ్రీ లక్ష్మీ గణపతి హోమం, ఉదయం 6 గంటలకు శ్రీ గణపతి, కుమార స్వామి, శ్రీ అయ్యప్ప స్వామిలకు అభిషేకం, ఉదయం 10:30 గంటలకు భజన కార్యక్రమాలు, మధ్యాహ్నం 1.30 గంటలకు మహా పడి హారతి, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని శ్రీ బాలాజీ అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

గుడిమల్కాపూర్‌లో ఇంటింటికీ బీజేపీ



గాయత్రీనగర్‌లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో దేవర వంశీ తదితరులు

గోల్కొండ: ప్రధాని మోదీ చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయడం కోసమే ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని బీజేవైఎం నగర కార్యదర్శి దేవర వంశీ అన్నారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్, గాయత్రీనగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్రమోదీ పథకాలను మహిళా ఓటర్లకు వివరించారు. మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. మరోసారి ప్రధాని మోదీని గెలిపించాలంటే బీజేపీ అభ్యర్థులకు ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన వెంట అశ్విన్ తదితరులున్నారు.